# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

ఆదివారం | 12 మే, 2024 | పేజీలు : 07


## ఓటర్లు తప్పకుండ ఓటు హక్కును వినియోగించుకోవాలి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** లోకసభ ఎన్నికల్లో జిల్లాలో ఓటర్లందరు తప్పకుండ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ఈనెల 13న ఉదయం 7గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు లోకసభ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఈనెల 13న ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల కార్యాలయాలు,పరిశ్రమలు వేతనంతో కూడిన సెలవును ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఓటు హక్కు కలిగిఉన్నవారు తప్పకుండ ఓటు వేయాలని ఓటర్లను కోరారు..

# అందరూ విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

### కలెక్టర్, ఎన్నికల అధికారి భవేశ్ మిశ్రా

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** పోలింగ్ మెటీరియల్ పంపిణీ పర్యవేక్షణ సెక్టార్ అధికారులు, పోలింగ్ విధులు కేటాయించిన పిఓలు, ఎపిఓలు, ఓపిఓలు 12వ తేదీ ఉదయం 7 గంటలకు జిల్లా కేంద్రంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి భవేశ్ మిశ్రా తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు విధిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, మీ ఓటు వజ్రాయుధం లాంటిదని సరైన నాయకున్ని ఎన్నుకోవడం కోసం అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉండడం వల్ల ఉదయాన్నే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. ఎలాంటి అసౌకర్యాలు లేకుండా మంచి నీటి సౌకర్యంతో పాటు నీడ కోసం టెంట్లను చేసి ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. భూపాలపల్లి ప్రాంతంలో ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. మెటీరియల్ పంపిణీ కొరకు 30 సెక్టార్లు ఏర్పాటు చేశామని, పర్యవేక్షణకు ప్రతి సెక్టార్ కు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. పోలింగ్ స్టేషన్ నెంబర్, బస్సు నెంబర్ తో ట్రాకింగ్ చేయాలని అన్నారు. కేంద్రంలో సిబ్బంది సహాయత కొరకు పోలింగ్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు

తరువాయి 7లో



# మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ఈనెల 13వ తేదిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో శనివారం హన్మకొండ జిల్లా కలెక్టరేట్ లోని ఎన్ఐసిహాల్ వరంగల్ పార్లమెంట్ నియోకజవర్గ పరిధిలోని పోలింగ్‌కేంద్రాలకు మూడవ మరియు తుది ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా ఎన్నికల పోలింగ్ సిబ్బంది, మైక్రో అబ్జర్వర్‌లను కేటాయించినట్లు రిటర్నింగ్ అధికారి, వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య తెలిపారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ బండారి స్వాగత్ రణ్వీర్ చంద్ సమక్షంలో వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్అధికారి, వరంగల్ కలెక్టర్ ప్రావిణ్య ఎన్నికల సిబ్బంది కేటాయింపునకు సంబంధించిన మూడవ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వర్తించే ఎన్నికల సిబ్బంది జాబితాను ఈపార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఆయా జిల్లాల కలెక్టర్లకు అందించారు. ఈర్యాండమైజేషన్ ప్రక్రియలో హన్మకొండ, జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు సిక్తా పట్నాయక్, రిజ్వాన్, భాషాషేక్, భవేష్ మిశ్ర, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డిఆర్ఓ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక విధానాలను
# అవలంబిస్తున్న బిజెపిని ఓడించాలి

### జనగామ మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని జనగామ మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా గడప గడపకు ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని బానాజిపేట గ్రామంలో సీపీఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా నిత్యావసర వస్తువుల ధరలను అధికంగా పెంచి పేద ప్రజలను పట్టి పీడిస్తున్న బీజేపిని పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బీజేపి ప్రభుత్వానికి ఈనెల 13న జరిగే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అన్ని వర్గాల ప్రజలు క్షేమంగా ఉండాలని మిత్రపక్షాలు బలపర్చిన కాంగ్రెస్‌పార్టి ఎంపీ అభ్యర్థి కడియం కావ్యని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పారి జిల్లా నాయకుడు ఆది సాయన్న, నాయకులు ముప్పిడి ఎల్లయ్య, ఎస్ ఎల్లయ్య, ఉడుముల జయమ్మ, సులుగు రమేష్, కాంగ్రెస్ పార్టి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బీర్లు వైన్ షాపుల్లో నిల్... బెల్ట్ షాపుల్లో ఫుల్

**ప్రజాపక్షం/ కమలాపూర్ :** కమలాపూర్, ఉప్పల్, శనిగరం, అంబాల గ్రామాలలోని వైన్ షాపులలో మద్యం అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. మండలంలో 6 వైన్ షాపులు ఉన్నప్పటికి కొన్ని షాపులలో మద్యం ప్రియులు బీర్లు కొనేందుకు వెళ్ళే నిర్వాహకులు ఏ కంపెనీ బీర్లు లేవని నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో మద్యం ప్రియులు వచ్చిన బీర్లు ఏమైనాట్టని అడిగితే దబాయిస్తున్నారని అంటున్నారు. వైన్ షాపులో లైట్ బీర్ ధర రూ. 150, స్ట్రాంగ్ బీర ధర రూ. 160 ఉంటే అట్టి బీర్లను నిర్వాహకులు బెల్ట్ షాపులకు తరలించి అదనంగా రూ. 10 సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. ఎక్సైజ్ అధికారులు మాత్రం మండలంలో ఒక్క బెల్ట్ షాపు కూడా లేదని ప్రచారం చేస్తున్నారు. బెల్ట్ షాపులు నడుపుతున్న నిర్వాహకులు పెద్ద సంఖ్యలో బీర్లు నిలువ చేసి రూ. 200 నుంచి రూ. 250 రూపాయలకు విక్రయిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో వైన్ షాప్ నిర్వాహకులకు సహకారం అందిస్తూ మందు బాబుల జేబులు కాలి చేస్తున్నారు. అంతే కాకుండా క్వాటర్ మందు పై 30 నుంచి 50 రూపాయలు అదనంగా వసూలు చేస్తూ బెల్ట్ షాపుల నిర్వాహకులు మందుబాబుల వద్ద డబ్బులు దండుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వైన్ షాప్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మందుబాబులు కోరుతున్నారు.




## మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండలంలోని వెల్ది గ్రామంలో గల మోడల్ స్కూల్‌జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కొరకై 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు మే 25వ తేదీ వరకు www.tsmodelschools.com అనే వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ వాసం వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 40, బైపీసీలో 40, సీఈసీలో 40, ఎంఈసీలో 40 మొత్తం కలిపి 160 సీట్లు ఉన్నట్లు ఆయన వివరించారు. ఏమైనా సందేహాలుంటే పూర్తి వివరాలకు 92479 92045 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

## అదుపుతప్పి లారీ బోల్తా



**ప్రజాపక్షం/రాయపర్తి:** దుపు తప్పి లారీ బోల్తా పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ వడ్డే సందీప్ తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం నుండి డిల్లీ కి మామిడి పండ్ల లోడ్ తో వెళుతున్న లారీ శనివారం మండలంలోని మొరిపిరాల గ్రామ శివారు లో వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై ప్రమాదవశాతూ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని ఎస్ఐ సందీప్ తెలిపారు.

## నీలం మధు గెలుపు ఖాయం



**ప్రజాపక్షం/పాపన్నపేట:** మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు గెలుపు ఖాయమని పాపన్నపేట ఎంపీపీ చందనా ప్రశాంత్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలో మల్లంపేటలో ఆమె స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. వంద రోజులలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని చూసి ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నార న్నారు. మండలంలో కాంగ్రెస్ పార్టీకి భారీ మెజార్టీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

## హోరాహోరీగా పార్లమెంట్ ఎన్నికల ప్రచారం



**ప్రజాపక్షం/వేలేరు :** మే13న జరిగే పార్లమెంట్ ఎన్నికల ప్రచారం శనివారంతో ముగియగా మండలంలోని మూడు ప్రధానపార్టీలైనా కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్‌ల ఏంపి అభ్యర్థుల ఎన్నికల ప్రచారంపర్వం హోరాహోరీగా నిర్వహించగా శనివారం చివరిరోజు మండలకేంద్రంలో మాజీకుడా డైరెక్టర్ బిల్ల యాదగిరి ఆద్వర్యంలో ఎంపి అభ్యర్థి కడియం కావ్య గెలుపేలక్ష్యంగా ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించగా బిజెపి మండలఅధ్యక్షుడు కాట్రేవుల రాజుయాదవ్ ఆద్వర్యంలో మండలకేంద్రంలో వీధివీధినా ఎన్నికల ప్రచారం నిర్వహించి తమబిజెపి పార్టీ అభ్యర్థి ఆరూరి రమేష్‌ను అధ్యధిక మెజార్టీతో గెలిపించాలనికోరారు. కార్యక్రమంలో కాంగ్రేస్‌నాయకులు తాటికాయల వెంకటస్వామి, కోడూరి రవి, కొయ్యడ రవి, కొయ్యడ శంకర్, బిజెపి కార్యకర్తలు కాట్రేవుల రాజుయాదవ్, సీత సంపత్, ఎం రాజు ,మండలంచార్జ్ నాగవెల్లి యుగేందర్, మునిగడుప కిరణ్, పూర్ణచందర్ రుద్రోజు రాజు,రుద్రోజు కిరణ్ మోతె దుర్గయ్య,కీర్తి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్‌లో బీఆర్ఎస్ గెలుపు ఖాయం




**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** వరంగల్ లోక్‌సభ ఎన్నికలలో బీఆర్ఎస్ గెలుపు ఖాయం అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శనివారం హన్మకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో దయాకర్ రావు మాట్లాడుతూ తెలంగాణలో మే 13న జరుగునున్న ఎన్నికలపై దేశ వ్యప్తంగా అందరి దృష్టి నిలిచిందని అన్నారు. ఈ ఎన్నికలలో రాష్ట్రంలో మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి, గత పదేళ్లలో ఇచ్చిన హామీలు నెరవేర్చని నరేంద్ర మోడీకి తెలంగాణ ప్రజలు గుణపాఠం చెప్పనున్నారని అన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, అభ్యర్థి డాక్టర్ సుధీర్ కుమార్ , మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ వికలాంగుల సంస్థ చైర్మన్ ఎల్. వాసుదేవరెడ్డి, నాయకులు టి. జనార్ధన్ గౌడ్,నార్లగిరి రమేష్, జోరిక రమేష్,పులి రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## బిజెపికి ఉన్న ఆదరణ చూసి ప్రతిపక్షాల ఆరోపణ



**ప్రజాపక్షం/జఫర్గడ్:** దేశంలో బీజేపిపై ఉన్న ప్రజాదరణ చూసి కూడగట్టుకొని ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని వరంగల్ పార్లమెంట్ బీజేపి అభ్యర్థి ఆరూరి రమేష్ అన్నారు. శనివారం ఆయన సొంత గ్రామమైన మండలంలోని ఉప్పుగల్‌లో ఆరూరి రమేష్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌కు గ్రామ ప్రజలు ఘనస్వాగతం పలికి పార్టీలకు అతీతంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ మోదీ మీద విమర్శలు చేయడమంటే సూర్యుని మీద ఉమ్మి వేయడమే అన్నారు. అమలుగాని హామీలతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌పార్టీకి ఈ ఎన్నికల్లో భంగపాటు తప్పదన్నారు. ఆరు గ్యారంటీలు, 66 హామీలు, 420 పనులు చేస్తామని చెప్పి ఒక బస్సు ఫ్రీ తప్ప ఏం ఇవ్వకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. తెలంగాణలో అభివృద్ధి జరగాలంటే, నిధులు రావాలంటే బీజేపి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపి నాయకులు సుభాష్, గాదెపాక అయోధ్య, బుర్ర తిరుపతి, గద్దం రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశం అభివృద్ధి చెందాలంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాలి



**ప్రజాపక్షం/రాయపర్తి:** దేశం అభివృద్ధి చెందాలంటే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం హనుమండ్ల ఝాన్సీ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొండాపురం, మైలారం కాట్రపల్లి, రాయపర్తి గ్రామాలలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య కు మంచి మెజారిటీ అందించాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షు డు జాటోట్ హమ్యా నాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, మండల నాయకులు మాచర్ల ప్రభాకర్, రెంటాల గోవర్ధన్ రెడ్డి, సిరికొండ కృష్ణారెడ్డి,ముద్రపోయిన వెంకన్న, ఎనగందుల మురళి, మందాటి సుదర్శన్ రెడ్డి, ఎండి మహిముద్,ఎండిఅప్రోజ్ గూగులో త్ శ్రీనివాస నాయక్, గారే బిక్షపతి, ఎల్లారెడ్డి, మచ్చా రమేష్, పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని ఇంటింటా ప్రచారం



**ప్రజాపక్షం/కమలాపూర్:** కమలాపూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో కాంగ్రెస్ శ్రేణులు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి రాజేందర్ రావు ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు వివరిస్తూ, కేంద్రంలో రాబోయే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఓటర్లకు కాంగ్రెస్ నాయకులు వివరించారు.ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోని కాంగ్రెస్ ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రధాని మోదీతోనే దేశం అభివృద్ధి



**ప్రజాపక్షం/కమలాపూర్ :** దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉంటేనే భారతదేశం మరింత అభివృద్ధి చెందుతుందని బిజెపి మండల అధ్యక్షులు కట్కూరి అశోక్ రెడ్డి అన్నారు. కమలాపూర్ మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో బిజెపి నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బిజెపి అభ్యర్థి బండి సంజయ్ ని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మోడీ 10 సంవత్సరాల కాలంలో ప్రపంచంలోనే భారతదేశాన్ని ఉన్నతమైన స్థానానికి తీసుకెళ్ళారని వివరించారు. దేశ ప్రజల కోసం నిరంతరం కృషి చేసే మోడీ ప్రభుత్వానికే ప్రజలు పట్టం కట్టాలని ఆయన కోరారు. ఆయా గ్రామాలలో బిజెపి నాయకులు మమ్మూరంగా ప్రచారం నిర్వహించారు.

## బార్ అసోసియేషన్ సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ బార్ అసోసియేషన్‌ను రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్దన్ సందర్శించారు. అక్కడి బార్ అసోసియేషన్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బార్ అసోసియేన్ ఆద్వర్యంలో ఇటీవల మహిళాన్యయవాదుల సౌకర్యార్యార్థం హాల్‌తో పాటు వేసవి కాలం దృష్ట్యా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల వారి సేవలు అభినందించారు. అనంతరం దుస్సా జనార్ధన్ జూనియర్ న్యాయవాదులకు కొత్తగా వచ్చిన మేజర్ క్రిమినల్ యాక్టు పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, కార్యవర్గ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు.



## సీతంపేటలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం



**ప్రజాపక్షం/హసన్‌పర్తి :** కాంగ్రెస్‌తోనే బడుగు బలహీన వర్గాల పేదలందరికీ న్యాయం జరుగుతుందని సీతంపేట గ్రామ మాజీ ఎంపీటీసీ గిన్నారపు సుగుణ సదానందం అన్నారు. మండలంలోని సీతంపేట గ్రామంలో మాజీ ఎంపీటీసీ గిన్నారపు సుగుణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపుకై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయాలని ఓటర్లను కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో 6 గ్యారంటీలు అమలుచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు చిర్ర స్వప్న, నద్దునూరి చేరాలు, సీనియర్ నాయకులు చిర్ర తిరుపతిగౌడ్, జంపాల యుగేంధర్, గుంపుల రణధీర్, కొత్త రాజయ్య, మాజీ ఉపసర్పంచ్ చిర్ర తిరుపతి, గిన్నారపు రాజు, రోహిత్, జంపాల మురళి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో బిఆర్ఎస్ శ్రేణుల చేరికలు



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం గ్రామానికి చెందిన పలువురు బిఆర్ఎస్ శ్రేణులు శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ స్వగృహంలో రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాళేశ్వరం దేవస్థానం కమిటీ మాజి చైర్మన్, బిఆర్ఎస్ నాయకులు గంట రాంనారాయణ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ సుల్తాన్, బాపు, రంజిత్ రెడ్డి, సమ్మయ్య, రాజయ్య తదితర బిఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శ్రీధర్ బాబు వీరికి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కామిడి శ్రీనివాస్ రెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు లేతకరి రాజబాపు, మహిళా అధ్యక్షురాలు బందెల సత్తెమ్మ, మండల ప్రధాన కార్యదర్శి మాడుగుల పవన్ శర్మ,యువ జన నాయకులు షకీల్,నగేష్,శేఖర్ పాల్గొన్నారు.

## ఇసుక క్వారీల వద్ద కాంగ్రెస్ ప్రచారం



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం పరిధిలోని ఇసుక క్వారీల వద్ద శనివారం కాంగ్రెస్ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం పూస్కుపెల్లి గ్రామంలో కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలపై ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కామిడి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎంపీటీసీ రేవెల్లి మమత,బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేంగాని అశోక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు లేతకరి రాజబాపు, మండల మహిళా అధ్యక్షురాలు బందెల సత్తెమ్మ, మండల కోశాధికారి గందెసిరి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి మాడుగుల పవన్ శర్మ, సీనియర్ నాయకులు మాచర్ల సారయ్య, గ్రామ అధ్యక్షులు మంగాయి లక్ష్మన్ తదితర యువజన నాయకులు, పాల్గొన్నారు.

## సేవాభావం కలిగి ఉండాలి పిఏసిఎస్ డైరెక్టర్



**ప్రజాపక్షం/రేగోడు :** ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని కలిగి ఉండాలి రేగోడు పిఏసిఎస్ డైరెక్టర్ కులకర్ణి నాగేందర్ రావు అన్నారు. ఈదురుగాల్లకు రేగోడుకు చెందిన గడియల సంగమ్మ మృతి చెందడంతో ఖర్చులకు 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపదలో ఆదుకోవడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ గౌడ్, రాధా కిషన్ గుప్తా, ప్రభాకర్, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

# మోడీ పాలనలోనే దేశం సుభిక్షం



**ప్రజాపక్షం/చిట్యాల:** నరేంద్ర మోడీ పాలనలోని భారతదేశం సుభిక్షంగా ఉందని బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ అన్నారు. బుర్ర వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని చిట్యాల, జూకల్, చల్లగరిగ, గోపాలపురం, నైన్ పాక, జడల్ పేట, గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించి బిజెపి కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి ప్రజలు గెలిపించాలని మరొక్కసారి నరేంద్ర మోడి ప్రధాని అవ్వాలని, వరంగల్ పార్లమెంట్ గడ్డ మీద బిజెపి జెండా ఎగురవేయడమే లక్ష్యంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి చిట్యాల మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ మాట్లాడుతఇంత పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ మండలంలో తియ్యడంగర్వంగవుందన్నారు. ఈ ఎన్నికల్లో మోడీ గెలవడం ఖాయం, ఆరూరి గెలుపు లో యువత పాత్ర కీలకమని ప్రపంచం మొత్తం మోడీ వైపు చూస్తుందని కాంగ్రెస్ పార్టీ ఈ దేశంలో 50 సంవత్సరాలు పాలించి దేశానికి ఉపయోగపడే ఈ ఒక్క పని చేయలేదని మోదీ పాలనలో బార్డర్ సురక్షితంగా బాంబు మోతలు కానీ, ఎలాంటి మత ఘర్షణలు కానీ జరగలేదన్నారు. మోదీ హయంలోనే దేశం రూపురేఖలు మారాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాలోతు కవిత గెలుపే లక్ష్యంగా



**ప్రజాపక్షం/మంగపేట :** మంగపేట మండలం తిమ్మంపేట గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్యక్షులు ఎగ్గడి అర్జున్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధులగా జిల్లా నాయకులు తాటికృష్ణ, చిలకమర్రి రాజెందర్ హాజరై మాట్లాడుతూ మహబూబాబాద్ పార్లమెంట్ బిఅర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ తో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు రుణమాఫీ చేస్తాను అని చెప్పి ఇప్పుడు మాట మార్చారు. క్వింటా వడ్లకు 500 బోనస్ ఇస్తానని ఇవ్వలేదని, ఆరు గ్యారెంటీలు అని చెప్పి ఒక గ్యారెంటీ కూడా అమలు చేయలేదని అన్నారు. పెన్షన్లు 4 వేలు ఇస్తానని చెప్పి ఇంతవరకు ఇవ్వడం లేదని అన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కావున ఇప్పుడు, మళ్లీ ఓట్ల కోసం రైతు రుణమాఫీ ఆగస్టు 15 తారీకు చేస్తానని అంటున్నాడు. కావున ప్రజలు గమనించాలని అన్నారు. ఇప్పుడు జరిగే పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాలోతు కవితకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో గాదె శ్రీనివాస చారి, చిన్నపెల్లి వెంకన్న, మోదుగు బాబు, కుందమల్ల రాంబాబు, నర్సింహా మూర్తి, ముప్పారపు సందీప్, జగదీష్, దుర్గం, నర్సింహా రావు, బోడ శంకర్, శానం నరేందర్, కోరం సంతోష్, నగేష్, చెట్టిపెల్లి సమ్మయ్య, జాడి రాంబాబు, దంతనపెల్లి నరేందర్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం తప్పదు



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధిః** ప్రజలను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెప్పనున్నారని ములుగు బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణరావు అన్నారు. శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులు, బూత్ లెవెల్ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వారికి ఎన్నికల రోజున పార్టీ శ్రేణులు అనుసరించాల్సిన వ్యూహాల గురించి వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీలను గాలికి వదిలేసిందని, రైతులను ఆదుకోవడంలో విఫలమయ్యిందని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని ప్రజలలో చైతన్యం వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అనధికాలంలో అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలే బిఆర్ఎస్ పార్టీ ఎంపి అభ్యర్థి కవిత గెలుపుకు సోపానాలు కానున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ములుగు తాత్కాలిక మండలాధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు చిన్న విజయ్, సీనియర్ నాయకులు గోవిందు నాయక్, పాల్గొన్నారు.

## పేరు గొప్ప...నీళ్లు సున్నా






**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధిః** ములుగు జిల్లా కేంద్రంలో బస్టాండ్ వద్ద బండారుపల్లి క్రాస్ వద్ద చలివేంద్రం ఏర్పాటుచేశారు. కానీ అందులో త్రాగునీరు లేక ఎండ తీవ్రతకు బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజుల క్రితం తేలికపాటి వర్షం పడడంతో ఇంకా ఎండలు మండుతున్నాయి. మండుతున్న ఎండలకు ప్రయాణం చేస్తున్న ప్రజలు దాహానికి ఎదురు చూస్తుండగా చలివేంద్రం అవుపడ్డది కానీ ఆ చలివేంద్రం మూసి వేయడం వలన ప్రజలు త్రాగునీరు కోసం అల్లాడుతున్నారు. అది మూసివేయడంతో గొప్పలకు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. కానీ అది మూసి ఉండడం సరికాదని ప్రజలు అంటున్నారు. ప్రారంభాలకు పేపర్లో ప్రకటనలు ఇచ్చుకుంటారు కానీ ఆచరణ మాత్రం పూర్తి చేయరని ప్రజలు అంటున్నారు. చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే ఎండ తీవ్రత తగ్గే వరకు అలాగే ఉండాలని అంటున్నారు. గొప్పలకు మాత్రం చలివేంద్రాలు ఏర్పాటు చేయొద్దని ప్రజలు ఆరోపిస్తున్నారు.

## కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని తెలంగాణ జన సమితి పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్చార్జ్ ఎలిశాల రాజేష్ అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తుందని గుర్తు చేశారు. బిజెపి,బీఆర్ఎస్ పార్టీ నాయకుల చెప్పుడు మాటలు విని ప్రజలు మోసపోవద్దన్నారు. వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా కడియం కావ్య చేతి గుర్తుపై ఓటు వేసే అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## నాలుగు లక్షల రూపాయలు స్వాధీనం చేసుకున్న ఎన్నికల బృందం



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** వర్ధన్నపేట పట్టణ కేంద్రం శివారు డిసి తండా చెక్ పోస్ట్ వద్ద శనివారం ఎస్ఎస్ టీం, పోలీసుల వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో సరియైన పత్రాలు లేనందున 4 లక్షల రూపాయల నగదు, ఎక్స్‌యూవి వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరిపెడ బంగ్లా నుండి హనుమకొండ వైపు వెళుతున్న వాహనాలను తనిఖీ చేస్తుండగా నాలుగు లక్షల రూపాయలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఇతని కిలో వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్ కుమార్, ఎన్నికల అధికారులు తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు



**ప్రజాపక్షం/గణపురం:** జయశంకర్ జిల్లా గణపురం మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు పుప్పాల దీపక్ పటేల్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దుద్దుకూరి వెంకటేశ్వర్లు శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంటు అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం అందరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ వైస్ చైర్మన్ దూడపాక శంకర్, మండల కో ఆప్షన్ సభ్యులు ఎండి చోటే మియా, గణపురం మండల అధ్యక్షులు రేపాక రాజేందర్, వాణిజ్య సెల్ అధ్యక్షులు కటుకూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చేతిగుర్తుకే ఓటు వేద్ధి సమగ్ర అభివృద్ది సాధిద్దాం



**ప్రజాపక్షం/టేకుమట్ల :** వరంగల్ పార్లమెంట్ ఎంపి అభ్యర్థి కడియం కవ్య కాంగ్రెస్ చేతి గుర్తుకు ఓటు వేద్దాం దేశంతో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధిని సాధిద్ధామని మండల అధ్యక్షుడు కొటగిరి సతీష్ గౌడ్ అన్నారు.ఈ సందర్భంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అదేశాల మేరకు టేరకు మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో ఇంటిటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.మండల అధ్యక్షుడు కొటగిరి సతీష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అవినీతిని అంతమొందించేందుకు చేయి చేయి కలిపి చేతి గుర్తుకు ఓటు వేసి ఓక నియంత పాలనకు చేరమ గీతం పాడాలని ఇప్పుడు దేశంలో మతతత్వ రాజకీయాలు చేస్తూ ప్రజా సంక్షేమన్ని విస్వరిస్తూన్నా మరో మతతత్వ పార్టీని కూల్చేందుకు మరోసారి హస్తం గుర్తుకు ప్రజలు తమ అమూల్యమైన ఓటు వేసిప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ అభివృద్ధి లో భాగస్వాములు కావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు కూర రాజిరెడ్డి,సంగి రవి,శ్రీపతి శ్రీనివాస్,వేణు తదితరులు పాల్గోన్నారు.

# వరంగల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగర వేయాలి



**ప్రజాపక్షం/వర్ధన్నపేట:** కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం వర్ధన్నపేట మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ అధ్యక్షతన శనివారం స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించగా ముఖ్యఅతిథిగా వర్ధన్నపేట శాసనసభ్యులు విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. అనంతరం వర్ధన్నపేట టౌన్ ప్రాంతంలో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొని అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరడం ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ సోమవారం జరిగే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే విధంగా ప్రతి కార్యకర్త కష్టపడాలన్నారు. మతాల పేరుతోకులాల పేరుతో హత్య రాజకీయాలు చేస్తున్న బిజెపిని గద్దె దించాలన్నారు. దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని కావాల్సిన అవసరం ఉందన్నారు.అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వాళ్లనే మనం స్వేచ్ఛగా బత కాగాలుగుతున్నాం. అలాంటి రాజ్యాంగాన్ని మార్చాలని నరేంద్ర మోదీ చూస్తున్నా మోదీ బిజెపి పార్టీ కి ఓటు అనే ఆయుధం ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. పార్లమెంట్లో మన సమస్యలపై గళం విప్పగల వ్యక్తి మన డాక్టర్ కడియం కావ్య ఉందన్నారు. రేపు జరగబోయే ఎన్నికల్లో సీరియల్ నెంబర్.2 మీద ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి బ్యాంక్ చైర్మన్ మారినేని రవీందర్ రావు, వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ అంగోతు అరుణ, కౌన్సిలర్లు సుధీర్, వరంగల్ జిల్లా కిసాన్ సెల్ బొంపల్లి దేవేందర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి టౌన్ అధ్యక్షుడు మైస సురేష్, సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్, సాయి రెడ్డి, కీమా నాయక్, ఎన్ఎస్‌యుఐ నియోజకవర్గ అధ్యక్షుడు రాకేష్ యాదవ్, మిత్రపక్షాలు సిపిఐ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వివిధ అనుబంధ సంఘాల నాయకులు మహిళలు నాయకులు కార్యకర్తలుపెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నర్సారెడ్డి నేతృత్వంలో... కాంగ్రెస్‌లో చేరికలు



**ప్రజాపక్షం/గజ్వేల్:** డిసిసి అధ్యక్షులు నర్సారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఆయా పార్టీల నుండి నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాచగిరి తాజా మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్ పైసం వెంకటేష్, అంబర్పేట సీనియర్ నేత కేశవరెడ్డి తదితరులతో పాటు ఆయా పార్టీల శ్రేణులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోగా, వారికి డిసిసి అధ్యక్షులు నర్సారెడ్డి కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సందీప్ రెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్, పాల్గొన్నారు.

## 62 సార్లు కాంగ్రెస్ రాజ్యాంగాన్ని మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వామే



**ప్రజాపక్షం/నెక్కొండ:** భారతదేశంలో నేటి వరకు భారత రాజ్యాంగాన్ని 62 సార్లు వారికి అనుకూలంగా కాంగ్రెస్ ప్రభుత్వాలు మార్చాయని, శనివారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో మానుకోట బిజెపి పార్లమెంట్ అభ్యర్థి సీతారాంనాయక్‌కు ఓట్లు వేయాలంటు గడప గడపకు ప్రచారంలో పాల్గొన్న మండల బిజెపి పార్టీ అధ్యక్షుడు సొంటిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ఆరోపణలను ప్రజలు ఓటుతో తిప్పి కొడతారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంబాల రాంగోపాల్, శ్రీరంగం శ్రీనివాస్, పులి ప్రసాద్, సందీప్, దామరచర్ల రామారావు, అనిల్,పాల్గొన్నారు.

## నేడు జాతీయ సాంకేతిక దినం



**ప్రజాపక్షం/నెక్కొండ:** నేడు భారతదేశంలో జాతీయ సాంకేతిక దినాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో ఏఐటియూసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు మాట్లాడుతూ భారతదేశంలో ఎంతో శక్తి యుక్తి, మేధాశక్తి ఉన్న వారికి కొదవ లేదని కానీ పాలకుల నిర్లక్ష్యంతో చేతగాని తనంతో భారత మేధాశక్తి మసకబారి పోతున్నదని ఆయన అన్నారు. 1998 మే 11న ఇద్దరు మనుషులు ప్రయాణించే చిన్న విమానాన్ని తయారు చేసి విజయవంతంగా ప్రయోగించిన రోజని, అలాగే ఇదే రోజు స్వదేశీ పరిజ్ఞానంతో రాజస్థాన్‌లోని ప్రోక్రాన్‌లో అనుబాంబును విజయవంతంగా ప్రయోగాత్మకంగా టెస్ట్ ఫైర్ చేశారని, దీనికి తోడు త్రిశూల్ క్షిపణి విజయవంతంగా ప్రయోగించారని అందుకే ఆనాటి కేంద్ర ప్రభుత్వం మే 11ను నేషనల్ టెక్నాలజీ డే గా జరుపుకుంటుందని భారతదేశంలో మేధావులకు కొదవలేదని, వారిని పాలకులు ప్రోత్సహిస్తే ప్రపంచంలోనే భారతదేశాన్ని మొదటి స్థానంలో నిలబెడతారని ఆయన అన్నారు.

## అంతంత మాత్రంగానే బిజెపి ప్రభావం

**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి:** ములుగు జిల్లాలో మే 13వ తేదీన పార్లమెంట్ ఎన్నికలు జరగనున్నాయి. కానీ ములుగు జిల్లాలో నాడు కాంగ్రెస్ పార్టీలో సభ్యులందరూ ఖాళీ అయ్యారు. నేడు బిఆర్ఎస్ పార్టీలో నుండి ములుగు జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి రావడంతో ఆ పార్టీ ఖాళీ అవుతున్నట్లు సమాచారం. బిఆర్ఎస్ పార్టీ నుండి ఎన్నికల సమయంలో బూత్ కమిటీ మెంబర్ దొరకడం లేదని తెలుస్తుంది. ఇలా అయితే బిఆర్ఎస్ జిల్లాలో ఖాళీ అవుతున్నట్లు తెలుస్తుంది. తెలంగాణలో ఏ ప్రభుత్వం ఉంటే ఆ ప్రభుత్వానికి రాష్ట్రంలో ఉన్న నాయకులందరూ పార్టీలు మారుతున్నారని అందరికి తెలిసిన విషయమే కానీ ఎన్నికల సమయంలో పార్టీ నాయకులు ప్రజలను మోసం చేస్తూ ఇష్టం వచ్చిన పార్టీలకు మారడం వాళ్ళ ఇష్టమేనా ప్రజల బాగోగులు చూడరా వారి అభివృద్ధి వారికి కావాలా ప్రజల అభివృద్ధి అవసరం లేదని ప్రజలు అనుకుంటున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కుటుంబ పాలన చేయడం జరిగింది. అలాగే పార్లమెంట్ ఎన్నికలు 13వ తేదీన సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు జరుగుతాయి. ఎన్నికలలో అభివృద్ధి చేసే నాయకుడికి ఓటు వేస్తున్నామని ములుగు జిల్లా ప్రజల మనసులో మాట.

## మనస్తాపంతో ఉరివేసుకొని వ్యక్తి మృతి





**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట మండల పరిధి లోని నగరం తండా గ్రామానికి చెందిన కేతావత్ స్వామి శనివారం తెల్లవారుజామున ఉరివేసుకొని చనిపోయాడు. వివరాల్లోకెళ్తే కేతావత్ స్వామి అనే వ్యక్తి ఒక సంవత్సరం క్రితం వివాహం జరిగినది. తన యొక్క తాత యొక్క అనారోగ్యానికి హాస్పిటల్లో చూపించడం వల్ల పెళ్లి ఖర్చులు కోసం చేసిన అప్పులు పెరిగిపోయి ఆర్థిక ఇబ్బందుల వల్ల మనస్థాపం చెంది ఈరోజు పొలం వద్దకు వెళ్లి తన పొలం వద్ద గల చెట్టుకి చున్నితోని ఉరి వేసుకుని మరణించినాడు. అతని భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించడమైనది. ఎస్సై శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి:** బావిలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన రాజశేఖర్ ఫిర్యాదు మేరకు జంగాలపల్లి గ్రామం వద్ద రవీందర్‌రెడ్డి బావిలో గుర్తు తెలియని మృతదేహాన్ని బయటకు తీసినట్లు ఆయన అన్నారు. అతని వయస్సు దాదాపు 45 సంవత్సరాలు ఉంటుందని, అలాగే అతని చర్మ ఊసిపో తుందని, 15 రోజులు బావిలో పడి ఉంటుందని అన్నారు. అనటి ఒంటిపై తెలుపురంగు ఫుల్ బనీన్, బ్లూ రంగు చొక్కా డిజైన్ గీతల లుంగి ఉందని, అతని గురించి తెలిసిన వారు ములుగు పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని ఎస్ఐ తెలిపారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి



**ప్రజాపక్షం/కొడకండ్ల:** కాంగ్రెస్‌తోనే దేశ, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కొడకండ్ల మండల అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ అన్నారు. శనివారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఇంచార్జి ఝాన్సి రెడ్డిల ఆదేశాల మేరకు వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య గెలుపుకొరకు ఇంటింటి ప్రచారాన్ని మండలంలో పెద్ద ఎత్తున నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ మాట ఇస్తే తప్పదని 6 గ్యారంటీలను అమలుచేస్తూ సంక్షేమ పాలనను అందించడం జరుగుతుందన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఆగష్టు లోపు అమలుచేస్తారని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఇందిరమ్మ ఇండ్లను పేదవారికి అందించడం జరుగుతుందని, ఈ దేశానికి రాహుల్‌గాంధీ ప్రధాని అవుతాడని కావున పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యను అధిక మెజార్టీతో మీ అమూల్యమైన ఓటును చేతి గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొడకండ్ల టౌన్ అధ్యక్షులు మునురం రవీందర్, మండల మహిళ అధ్యక్షురాలు వర్ర, ఎస్సీ సెల్ అధ్యక్షులు భిక్షపతి, బీసీ సెల్ అధ్యక్షులు వలబోజు రమేష్, మండల ఎన్ఎస్‌యూఐ నాయకులు హరిగోపాల్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్ బత్తుల వెంకన్న, మనోహర్, కిసాన్ సెల్ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి, ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు రాయపురం ఉప్పలయ్య, పాలకుర్తి దేవస్థాన డైరెక్టర్ ఐత రాజు, కొడకండ్ల మాజీ సర్పంచ్ మధుసూదన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటింగ్ నమోదులో తెలంగాణ ముందుండాలి



**ప్రజాపక్షం/నెక్కొండ:** పార్లమెంట్ ఎన్నికలలో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకుని తెలంగాణ ఓటర్లు దేశంలోనే ముందుండాలని వరంగల్ డిసిఐసి అధ్యక్షులు గిరగాని సుదర్శన్‌గౌడ్, తెలంగాణ స్టేట్ కన్జ్యూమర్స్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుగుపల్లి శ్రవణ్‌కుమార్ కోరారు. నెక్కొండ రైల్వేస్టేషన్, బస్టాండ్ కూడలి, అంబేద్కర్ సెంటర్‌లో శనివారం వినియోగదారుల సంఘాలు స్వచ్ఛంద సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో 100 శాతం ఓటింగ్ నమోదు లక్ష్యంగా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రయాణికులు చిరు వ్యాపారులు, వివిధ వర్గాల ప్రతినిధులను కలిసి ఓటు వినియోగంతో ఒనగూరే ప్రయోజనాలను వివరించారు. ఎన్నికల వేళ తమ పార్టీకే ఓటు వేయాలని తమ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీలు ప్రచారం చేసుకోవడం సహజమని, తాము మాత్రం మాకు ఓటేయమంటూ రాలేదని, నచ్చిన ఎవరికైనా ఓటు వేయాలని కోరుతున్నామన్నారు. అభ్యర్థులు ఎవరో నచ్చకుంటే నోటా కైనా ఓటు వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల మండలి కార్యదర్శి ఈగ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు నాగెల్లి సారంగం, స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ బాధ్యుడు బెజ్జంకి ప్రభాకర్, స్వచ్ఛంద సంస్థల సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబోయిన రాజశేఖర్, నెక్కొండ రైల్వే టికెట్స్ అవేర్‌నెస్ ఫోరం కన్వీనర్ గోరంట్ల వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిక పంపిణీ చేస్తున్న ఎంఎల్ఏ దొంతి



**ప్రజాపక్షం/ నర్సంపేట:** నర్సంపేటపట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం దగ్గర నర్సంపేట వడ బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్, అధ్యక్షుడు మహదేవుని రాజవీరుల ఆధ్వర్యంలో శ్రీమహాత్మ బసవేశ్వర 890 జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈవేడుకలకు నర్సంపేట ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శ్రీ మహాత్మ బసవేశ్వర చిత్రపటానికి పూలమాల వేసి కొబ్బరికాయలు కొట్టారు. వేసవికాలం పురస్కరించుకొని చల్లటి మజ్జిగను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ బసవేశ్వరుడు 890వ సంవత్సరం ముందుగా సమాజంలో హైందవ మతాన్ని పురస్కరించుకొని కుల వ్యవస్థను, వర్ణ బేదాలను, లింగ వివక్షత సమూలంగా వ్యతిరేకించిన అభ్యుదయవాది అన్నారు. లింగమత ధర్మంపాటించిన విశ్వగురువు బసవన్న బసవడు అనే బసవేశ్వరుని జయంతి వేడుకలు నర్సంపేట కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం అభినందించారు. ఈకార్యక్రమంలో శాన ఉమామహేశ్వర్, కొండూరు లింగయ్య, మహదేవుని జగదీష్, బక్కెర సంపత్, కిషోర్, పవన్, నాగేందర్, రాజు, రాము, రవీందర్, అక్కపెల్లి రమేష్, పంజాల రమేష్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, పాలాయి శ్రీనివాస్, బత్తిని రాజేందర్, బాబురావు, ఎర్ర యాకుబ్‌రెడ్డి, ఇల్లందుల సాంబయ్య పాల్గొన్నారు.

## ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు..

**ప్రజాపక్షం/మనోహరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా పాలనతోనే గ్రామాలన్నీ మరింత అభివృద్ధి చెందుతాయని మాజీ ఉపసర్పంచ్ శ్రీహరి గౌడ్, కాంగ్రెస్ నాయకులు నరేన్ రెడ్డిలు అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని చెట్ల గౌరవరం గ్రామంలో శనివారం మాజీ ఉపసర్పంచ్ శ్రీహరి గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులంతా మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ కి మద్దతుగా ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ, బక్క రమేష్, మల్లారెడ్డి, బిక్షపతి, యువకులు పాల్గొన్నారు.

## బిజెపి నాయకులు ఇంటింటి ప్రచారం చేస్తున్న దృశ్యం



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** మనోహరాబాద్ మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ కళ్ళకల్ గ్రామంలో ముమ్మరంగా కొనసాగుతున్న బిజెపి పార్టీ ఇంటింటి ప్రచారం. భారతీయ జనతా పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్ రావుకి మద్దతుగా మండల అధ్యక్షులు కమ్మరి నరేందర్ చారి ఆధ్వర్యంలో బిజెపి నాయకులు శనివారం ఉదయం గ్రామంలోని బస్టాండ్ దగ్గర నుండి హనుమాన్ దేవాలయం వరకు వీధుల్లో భారత్ మాతాకీ జై, భారతీయ జనతా పార్టీ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ ఇంటింటికి తిరుగుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలోగ్రామ అధ్యక్షులు కొత్తూరు మల్లేష్,బూతు అధ్యక్షులు ఈరక్క గోపాల్ నత్తి మల్లేష్ (కరాటే మాస్టర్) నాయకులు లద్దిపిర్ల చంద్రశేఖర్ గౌడ్, వీరబోయిన నాగేష్ ముదిరాజ్, వేణుగోపాల్ రెడ్డి, ఎర్రోళ్ల కృష్ణ, ఊట్ల నాగరాజు, ఎర్రోళ్ల శ్రీను, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ పేద ప్రజలకు అండ దండ



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:** పార్లమెంట్ ఎన్నికలలో ప్రచారంలో బాగంగా మెదక్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం నిర్వహించింది. శనివారం మెదక్ పట్టణం 6 వ వార్డులోని జాంబికుంటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హరిత నర్సింగ్ రావు నేతృత్వంలో మెదక్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పెద ప్రజలకు అండ దండగా ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలతో ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఎంపి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఎంపీ అభ్యర్థి నీలం మధును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కాలనీ వాసులను కోరారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెదక్ సీటు గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలుపాల్గొన్నారు.

# మెదక్ ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి:**మెదక్ పార్లమెంటు పరిధిలోని ప్రజలందరూ ఆలోచించి ఓటు వేయాలని, సాధ్యం కాని హామీలు ఇచ్చి ఐదు నెలల్లో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలం అయ్యిందని, కుట్రలు, మోసలు చేసే కాంగ్రెస్, బిజెపి వారిని తరిమికొట్టాలని మెదక్ బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి తో కలిసి శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో పూర్తిగా వైఫల్యం చెందిందని, అలవి కాని హామీలతో ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. ఇంత త్వరగా ప్రజల్లో విశ్వాసం కోల్పోవడం కాంగ్రెస్ కే దక్కిందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ ఢిల్లీ రిమోట్ తో నడుస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో కలెక్టర్ గా చేసిన అనుభవంతో సమస్యలు పరిష్కరిస్తానని అన్నారు. మెదక్ పార్లమెంటు పరిధిలో వెంకట్రామిరెడ్డి



ట్రస్ట్ ద్వారా నిరుపేదలకు విద్య అందిస్తానని, సీనియర్ ఐఏఎస్ లతో కోచింగ్ ఇప్పించి విద్యార్థులకు పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తానని హామీ ఇచ్చారు. పేదల ఇంట్లో పెళ్లికి ఒక్క రూపాయికే ఫంక్షన్ హాల్ అందిస్తామని అన్నారు. కల్యాణ మండపాలను తొమ్మిది నెలల్లో నిర్మిస్తానని హామీ ఇచ్చారు. యువతకు శిక్షణ తో పాటు స్కిల్ డెవలప్మెంట్ మెలుకువలు కల్పిస్తామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పది లక్షల ప్రమాద బీమా సౌకరం కల్పిస్తామని వివరించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం,కేసీఆర్ నాయకత్వంను ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్ గా పనిచేసిన అనుభవం, జిల్లా ప్రజల తో అనుబంధం ఉన్న వెంకట్రామిరెడ్డిని ఈ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. బిఆర్ ఎస్ గెలుపు ఖాయమని, మెజార్టీ లక్ష్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎం ఎల్ సి సుభాష్ రెడ్డి, నాయకులు తిరుపతి రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జగపతి, సోములు,కౌన్సిలర్లు మమిళ్ల ఆంజనేయులు, జయరాజ్ తదితరులు ఉన్నారు.

## ఇంటింటికి ప్రచారం నిర్వహించిన బిఆర్ఎస్

**ప్రజాపక్షం/వెంకటాపురం(నూగూరు):** వెంకటాపురం మండలంలోని మొర్రవాణిగూడెం గ్రామ పంచాయతీలో మహబూబాబాద్ ఎంపి అభ్యర్తి మాలోతు కవిత గెలుపు కొరకు ఇంటింటా ప్రచార కార్యక్రమంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గంప రాంబాబు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యుడు సనుగొండ శ్రీనివాస్ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే కెసిఆర్, కెటిఆర్‌లను టచ్ చేసి చూడాలని, ప్రభుత్వం మీ చేతుల్లోనే ఉందని కదా అని స్వతంత్ర్యం వచ్చిన కాడ



నుండి కాంగ్రెస్ అధికారంలో ఉంది కుంభకోణాలకు మారుపేరు మారిందన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో మాలోతు కవితను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వేల్పూర్ లక్ష్మీనారాయణ, శివాజీ, బుల్లె దేవుడు, బొల్లె వెంకన్న, బీసు, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో పోలీసుల నిఘా

**ప్రజాపక్షం/వాజేడు:** మావోయిస్టు కరపత్రాలు వెలువడిన నేపథ్యంలో మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన ములుగు జిల్లా వాజేడు మండలంలో పోలీసులు సరిహద్దు ప్రాంతాలు జల్లెడ పడుతున్నారు. తెలంగాణ సరిహద్దు గ్రామాలైన కృష్ణాపురం, దూలపురం గ్రామ సరిహద్దుల్లో వాజేడు ఎస్ఐ వెంకటేశ్వర్లు, పేరూరు ఎస్ఐ గొర్ల రమేష్ ముమ్మరంగా ఆదివారం వాహనాల తనిఖీలు చేపట్టారు. ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర, భద్రాచలం, ఏటూరునాగారం వైపు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ప్రయాణికుల బ్యాగులను సైతం తనిఖీ చేస్తున్నారు. మావోయిస్టు కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు బలగాలను మోహరింపజేసి



మావోయిస్టు ప్రభావిత గ్రామాల్లో గస్తీ తిరుగుతున్నారు.దీనిలో భాగంగానే ఏజెన్సీ ప్రాంతంలో పోలీసులు హైఅలర్ట్ ప్రకటించి తనిఖీలు చేస్తున్నారు. అనుమానితులను వివరాలు సేకరించి వదిలి వేస్తున్నారు. ఎవరైనా అనుమానితులుగా కనిపించిన పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని ప్రయాణికులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిఎఫ్ జవాన్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకున్న పౌరసరఫరాల డీఎం



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా మాతను పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ హరికృష్ణ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. ఏడుపాయల క్షేత్రానికి చేరుకోగానే వారికి ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారి వెంట కొత్తపల్లి రైతు సేవా సహకార సంఘం చైర్మన్ రమేష్ గుప్త, ధర్మకర్త రఘువీర్, నాగభూషణం, రైస్ మిల్లర్ అశోక్ గుప్త, తదితరులున్నారు.

## దేశానికి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వమే శరణ్యం

**ప్రజాపక్షం/గజ్వేల్:** దేశానికి ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వం శరణ్యమని మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్ రావు పేర్కొన్నారు. శనివారం గజ్వేల్ లో బిజెపి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. మెదక్ పార్లమెంటు స్థానం నుండి తనను గెలిపిస్తే నిరంతరం అందుబాటులో ఉండే సేవలు అందిస్తానని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపగా, రాష్ట్రానికి వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ 10 లక్షల కోట్లు మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. అయితే గత సీఎం కేసీఆర్ నయా పైసా ఇవ్వలేదని పేర్కొనడం సిగ్గుచేటని నిలదీశారు. గ్రామాల్లో చేపట్టిన ప్రతి పని కేంద్రంలోని బిజెపి సర్కార్ కేటాయించిన నిధులేనని అన్నారు. ముఖ్యంగా ఓటర్లను మభ్యపెట్టడానికి గ్రామాల్లో డబ్బులు, మద్యం పంపిణీకి బిఆర్ఎస్ సిద్ధం కాగా,



పోలీసులకు సమాచారం ఇవ్వాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నేతలు గురవారెడ్డి, నలగామ శ్రీనివాస్, నందన్ గౌడ్, టేడ్ రాంరెడ్డి, సింగం సత్తయ్య, జశ్వంత్ రెడ్డి, ఎల్కంటి సురేష్, మనోహర్ యాదవ్, ఉప్పల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

**ప్రజాపక్షం/పర్వతగిరి:** వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. శనివారం పర్వతగిరిలోని అంబేద్కర్ చౌరస్తాలో మండలాధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ముఖ్య అతిథులుగా కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరై ఇంటింటి ప్రచారం చేశారు. మన ప్రాంతాభివృద్ధికి తోడ్పాటు చేస్తుందన్నారు. ప్రతీ ఒక్కరూ ఈనెల 13న జరిగే ఎన్నికల్లో రెండవ నంబరులోని చేతి గుర్తుకు ఓటువేసి గెలిపించాలన్నారు. ఈ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో వరంగల్ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు బొంపల్లి దేవేందర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మండల,




గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలి**

డాక్టర్ కడియం కావ్యను గెలుపు కోరుతూ వర్ధన్నపేట మండలాధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. అనంతరం వర్ధన్నపేటలో నిర్వహించి ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని మార్చాలని నరేంద్ర మోడీ చూస్తున్నాడన్నారు. రేపు జరుగబోయే ఎన్నికల్లో 2వ నంబరులోని చేతి గుర్తుకు ఓటువేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ ఆంగోతు అరుణ, కౌన్సిలర్ సుధీర్, జిల్లా కిసాన్ సెల్ బొంపల్లి దేవేందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎంపీ అభ్యర్థి నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించాలి



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడి మధుసూదన్ రావు, తొమ్మిదో వార్డు కౌన్సిలర్ మేడి కళ్యాణి లు వార్డు ప్రజలను కోరారు. శనివారం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు తరఫున మెదక్ పట్టణంలోని తొమ్మిదవ వార్డులో మధుసూదన్ రావు, కల్యాణి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్, ప్రవీణ్, రాజు, ప్రభు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులు నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవు



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధిః** లోక సభ సార్వత్రిక ఎన్నికల విధులతో నియామకం కాబడిన ఉద్యోగులందరూ వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని ప్రిసైడింగ్ అధికారులు (పీఓ) అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏ.పిఓ) ఇతర పోలింగ్ అధికారులు (ఓపిఓ ) కేటాయించబడిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో ఉదయం 9 గంటల వరకు రిపోర్ట్ చేయాలని ,రిజర్వ్ పోలింగ్ సిబ్బంది కూడా డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో అందుబాటులో ఉండాలని, ఈ విధుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా కఠిన చ్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి క్రాంతి వల్లూరు ఆదేశాలు జారీ చేశారు.

## చామల గెలుపు ఖాయం : కొమ్మూరి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** భువనగిరిలో చామల కిరన్‌కుమార్‌రెడ్డి గెలవడం ఖాయమని కాంగ్రెస్ యువ నాయకులు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌ను ఆదరించి ఓటు వేస్తే అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా శనివారం జనగామ మండలంలోని గానుగుపహాడ్, వడ్లకొండ తదితర గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వయించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలోబాలరాజు, మండల పార్టీ అధ్యక్షులు నర్సిరెడ్డి, శివరాజ్ యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. ప్రశాంత్‌రెడ్డి భార్య సైతం పలు గ్రామాల్లో ప్రచారం చేశారు.

## కాంగ్రెస్‌లో చేరిన రాజేశ్వర్



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో మండల అధ్యక్షులు నూకల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతాప్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం రాజేశ్వర్ కాంగ్రెస్‌పార్టీ కండువా కప్పుకున్నారు. ఆయనతోపాటు పందిపెల్లి చంద్రారెడ్డి, గడ్డమీది ఆంజనేయులు, జిల్లా నర్సింగరావుతోపాటు పది మంది నాయకులు కాంగ్రెస్‌పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా తమ వంతు కృషి చేస్తామన్నారు. భారీ మెజార్టీ లక్ష్యంగా ప్రచారం కొనసాగించన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జంగిటి విద్యానాథ్, బాలకిషన్ గౌడ్, మాసాపేట రవీందర్‌రెడ్డి, మహత్మ చారి, డిడిగె రమేష్, నర్సింగరావు, గుర్రపు బాలరాజు, పాల్గొన్నారు.

## కడియం కావ్య చేతి గుర్తుపై ఓటువేసి గెలిపించాలి



**ప్రజాపక్షం/వర్ధన్నపేట :** హనుమకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో వరంగల్ పార్లమెంట్ ఇండియా కూటమి బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యం గెలిపించాలనిసిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ అన్నారు. శనివారం వనమాల కనపర్తి గ్రామంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.దేశంలో మత కల్లోలాలు సృష్టించి మతం పేరా అమాయకులను చంపుతున్నారని అన్నారు బిజెపి ప్రభుత్వాన్ని ఈ ఎన్నికల్లో గద్దె దింపి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని సూచించారు.వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా సమితి సభ్యురాలు రాస మల్ల దీన బంధ్ల రాజమణి, ధర్మసాగర్ మండల కార్యదర్శి కొట్టె వెంకటేష్, కుమార్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌వి మోసపూరిత వాగ్దానాలు..

**ప్రజాపక్షం/శివ్వంపేట :** కాంగ్రెస్ వి మోసపూరిత వాగ్దానాలను నమ్మి ప్రజలు మోసపోయారని అని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా శనివారం మండలంలోని సామ్యతండా, మార్లగడ్డతండా, తుక్యతండా, గేమ్ సింగ్ తండా, నానుతండా, బిక్యతండా, తాళ్లపల్లి తండా, కాలేరంతండా, సీతారాం తండా, జగ్యతండా, భీమ్లాతండా, శంకర్ తండా, తౌర్యాతాండలలో మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి,కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ ప్రతి మహిళకు నెల, నెల 2 వేల 5 వందల రూపాయలు, రైతుభరోసా ద్వారా ఎకరాకు 15 వేల రూపాయలు, భూమిలేని పేదలకు సంవత్సరానికి 12 వేల రూపాయలు, పంటలకు మద్దతు ధరతో పాటు 5 వందల రూపాయల బోనస్, పేదింటి ఆడపిల్లల పెండ్లికి కళ్యాణలక్ష్మీతో పాటు తులం బంగారం అందిస్తానని, రైతులకు 2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని కళ్ళబొల్లి మాటలు చెప్పి గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలను పూర్తిగా మోసం చేసిందని ఆమె మండిపడ్డారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త, జడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, ఆత్మక మిటీ మాజీ చైర్మన్ గొర్రె వెంకట్ రెడ్డి, తూము కృష్ణారావు, ఎంపీటీసీలు గుగులోత్ గోవింద్, మర్రి సత్తిరెడ్డి, పార్టీ ప్రధానకార్యదర్శి రాజశేఖర్ గౌడ్, అనూష అశోక్ గౌడ్, పత్రాల శ్రీనివాస్ గౌడ్,చంద్రశేఖర శ్రీశైలం యాదవ్,కల్లూరి వెంకటేష్,నల్ల బాల్ రాజ్,నాయిని వేమారెడ్డి, ఈశ్వర్ నాయక్, విజయ్ సింగ్, రాజేందర్ నాయక్, బీసీ సెల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్,ప్రభాకర్ రెడ్డి, తాటి కిష్టయ్య, ఎంచర్ల కుమార్ యాదవ్, గిరిజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు..



## కెసిఆర్‌కు పురిటిగడ్డలో నీరాజనం....పులకించిన సిద్దిపేట



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** తెలంగాణ మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ పురిటిగడ్డ సిద్దిపేటకు రావటంతో పట్టణమంతాగులాబి సంద్రంగా మారింది. ఉద్యమ నాయకున్ని చూసి కార్యకర్తలు ఉప్పొంగిపోయారు. కెసిఆర్‌కు అడుగడుగునా గులాబీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు, బోనాలతో, ఆటపాటలతో భారీ ర్యాలీలో పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సిద్దిపేటలో మెదక్ పార్లమెంట్ బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి తరుపున కేసీఆర్ ప్రచారం రోడ్ షో నిర్వహించారు. మహిళలు బోనాలు, డప్పు చప్పుల్ల మధ్య భారీ రోడ్ షో, ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అమలు కానీ హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీతో పాటు420హామీ ఇచ్చిందన్నారు. ఉచిత బస్ ప్రయాణం తప్పా ఎలాంటి హామీ నేరవేర్చలేదని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు

**బిజెపి మత విద్వేషాలను రెచ్చగొడుతుంది– కెసిఆర్**

బిజెపి మత విద్వేశాలను రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ది పొందాలని చూస్తుందని మాజీ సిఎం కెసిఆర్ అన్నారు. బిజెపి పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే పెట్రోల్, డిజిల్ 400 రూపాయలు అవుతుందన్నారు. మోడీ నల్ల ధనాన్ని తెచ్చి పేదల అకౌంట్‌లో పది హేను లక్షల డబ్బులు వేస్తానని హామీ ఇచ్చి అధికారం వచ్చిన తరవాత పట్టించుకోలేదని విమర్శించారు. బిజెపి పార్టీ ధనవంతులకే అనుగుణంగా ఉందని, రైతులకు ఒక్క రూపాయి కూడామాఫీ చేయదన్నారు. మరో సారి బిఆర్ఎస్ పార్టీ గుర్తు కారు గుర్తు కే ఓటు వేసి వెంకట్రామిరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.గతంలో నేను సిఎం గా ఉన్నప్పుడు 30వేల కోట్లు ఖర్చు పెట్టి రైతు రుణమాఫీ చేశానని, సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రుణమాఫీ చేయడంలో పూర్తిగా విఫలమైన్నాడని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పారూఖ్ హుసెన్ తదితరులు ఉన్నారు.

## జడ్పీటీసీ ఆర్థిక సహాయం



**ప్రజాంపక్షం/శివ్వంపేట :** మండలంలోని కొంతాన్ పల్లి గ్రామంలో ఇటీవలే ఉపాధిహామీ పనులకని వెళ్లి వడదెబ్బతో కాళ్లకంటి లక్ష్మీ మరణించిన విషయం పార్టీ వర్గాల ద్వారా తెలుసుకున్న జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్త శనివారం బాధిత కుటుంబానికి తన స్వంత డబ్బులు 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఎంపీటీసీ ఆకుల ఇందిరా శ్రీనివాస్, తాజామాజీ సర్పంచ్ గైనిబైటి శ్రీనివాస్ గౌడ్, రైతు సమన్వయ సమితి మాజీ మండల అధ్యక్షులు మొలుగు నాగేశ్వరరావు చేతులమీదుగా అందించడం జరిగినది ఆర్థిక సహకారాలను అందించే జడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తకు కొంతాన్ పల్లి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ ఉపాధ్యక్షులు జగజీవన్ రెడ్డి, మాజీ సర్పంచ్ దేవలింగం, గ్రామకమిటీ అధ్యక్షులు సంతోష్ కుమార్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు భూమా లింగం, సోషల్ మీడియా కన్వీనర్ సంతోష్ కుమార్, నాగరాజు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ రోడ్‌షోలకు ..తెలంగాణ ఉద్యమరోజుల్ని గుర్తుకుతెచ్చాయి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** బిఆర్ఎస్ అధినేత రోడ్‌షోలు నాటి తెలంగాణ ఉద్యమ రోజుల్ని గుర్తు చేశాయని..కెసిఆర్ సభలు విజయవంతమైన తీరు మాకు గెలుపు విశ్వాసాన్ని ఇస్తున్నాయని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. కాంగ్రెస్, బిజెపి సభలు,రోడ్‌షోలకు స్పందన కరువైందన్నారు. సిద్దిపేటలో అమిత్‌షా సభకు జనంలేక ఏడునిమిషాల్లో ముగించారని,సరూర్‌నగర్‌లో రాహుల్‌గాంధీ సభకు అదే పరిస్థితి అన్నారు. ప్రజలు కాంగ్రెస్ గ్యారంటీల వైఫల్యంపై గరంగరంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్‌కు శిక్ష వేయాలని ప్రజలు నిర్ణయానికి వచ్చారని..కాంగ్రెస్ నాయకులుఇచ్చిన బాండ్ పేపర్లు బౌన్స్ అయ్యాయన్నారు. తెలంగాణకు ఏమి ఇవ్వని బిజెపికి ఉత్తపుణ్యానికి ఓటేందుకు వేయాలని ప్రజలు భావిస్తున్నారన్నారు. కాంగ్రెస్, బిజెపి అ పవిత్రబంధాన్ని ప్రజలు గుర్తించారన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయనమాట్లాడారు. వెంకట్రామ్‌రెడ్డిని ఆదరించటం,ఆశీర్వదించటం అంటే బిఆర్ఎస్, కెసిఆర్‌ను ఆశీర్వదించటమే అన్నారు. ప్రజలను మతం పేరిట, కులం,గ్యారంటీల పేరుతో మోసం చేసే పార్టీలకు గుణపాఠం చెప్పాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు. ఈసమావేశంలో మాజీ ఎంఎల్సి ఫారుక్‌హుస్సేన్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్,గుండు భూపేశ్. కడవేర్గు రాజనర్సు,మోహన్‌లాల్, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కడియం కావ్యకు ఎంఆర్‌పీఎస్ సంపూర్ణ మద్దతు



**ప్రజాపక్షం/పాలకుర్తి:** వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు ఎంఆర్‌పీఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మోహన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 80 లక్షల మంది దళితులను మోసం చేసిన మందకృష్ణ మాదిగ మతోన్మాదుల చెంతకు చేరాడని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆత్మగౌరవం కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందన్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపికి బుద్ది చెప్పాలని దళితులకు పిలుపునిచ్చారు. దేశంలో, రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, నీరటి ప్రభాకర్ స్వామి, రంగయ్య, గాయాల ఎల్లయ్య,పాల్గొన్నారు.

## చామల కిరణ్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి



**ప్రజాపక్షం/మద్దూరు/ధూళ్మిట్ట :** దేశంలో ఇందిరమ్మ రాజ్యం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని, కేంద్రంలో రానున్నది కాంగ్రెస్ పార్టీయేనని, భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మనప్రాంతం నుంచి కానుకగా అందించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగపురి కిరణ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ముగింపు ప్రచారంలో భాగంగా శనివారం మద్దూరు మండల కేంద్రంలో స్థానిక సీనియర్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రైతుల సంక్షేమంకోసం రాష్ట్ర ప్రభుత్వం 15 ఆగస్టులోపల 2 లోల రూపాయల రుణమాఫీ చేస్తుందని, రైతులు సంబరాలకు సిద్దంగా ఉండాలని, రాష్ట్రంతో పాటుగా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే మరిన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాలు జరుగుతాయని నాగపురి కిరణ్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు మహమ్మద్ షౌకత్, మాజీ సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి, బూరుగు రాజు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అందరూ విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారిగా వచ్చిన సిబ్బంది వివరాలు హాజరు నమోదు పక్కగా చేయాలని ఆయన సూచించారు. వర్ష సూచన ఉన్న నేపథ్యంలో ఈవిఎం తడవ కుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. మెటీరియల్ పంపిణీ పర్యవేక్షణ నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పర్యవేక్షణ నోడల్ అధికారిగా మత్స్య శాఖ అధికారి అవినాష్ ను నియమించిన ట్లు తెలిపారు. విధులు కేటాయించిన అధికారులు తప్పనిసరిగా ఐడి కార్డు ధరించాలని ఐడికార్డు లేక పోతే కేంద్రంలోకి అనుమతించరని పటిష్ట మైన బందోబస్తు, సి సి కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మెటీరియల్ పరిశీలన తదుపరి ఎట్టి పరిస్థితుల్లోనూ మధ్యాహ్నం 2 గంట లకు బయలుదేరి మెటీరియల్తో పోలింగ్ కేంద్రాలు చేరుకు, ని పోలింగ్ కేంద్రం పరిసరాలను పరిశీలన చేసి తదుపరి పోలింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డిఓ మంగీలాల్, సెక్టార్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో నూతనంగా పోలింగ్ కేంద్రం

ప్రజాపక్షం/టేకుమట్ల: పార్లమెంట్ ఎన్నికలో మండలంలోని నూతనంగా ఏర్పడిన బండపల్లె గ్రామంలో నూతన పోలింగ్ కేంద్రంను పిస్ నెంబర్ 96 పై అధికారులు అధేశాల మేరకు ఏర్పటు చేసినట్లు తహసిల్దార్ విజయలక్ష్మి తెలిపారు.బండపల్లె గ్రామ ఓటర్లు ప్రాథమిక పాఠశాల నందు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటు అమ్ముకుంటే ప్రజా ప్రతినిధ్య చట్టం 171బి ప్రకారం శిక్షార్హులు అవుతారని తహసిల్దార్ కే విజయలక్ష్మి తెలిపారు.

## బిజెపితోనే దేశం అభివృద్ధి

ప్రజాపక్షం/అల్లాదుర్గం: దేశం అభివృద్ధి పథంలో ఉండాలంటే బీజేపీ పార్టీతోనే సాధ్యమని జహీరాబాద్ బిజెపి అభ్యర్థి బిబి పాటిల్ తనయుడు అభిషేక్ పాటిల్ తెలిపారు. మండలంలోని ముస్లాపూర్, గడి పెద్దాపూర్, దేవుల నాయక్ తండాలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముసలాపూర్ లో పలువురు ఉపాధి కూలీలతో ముచ్చటించి బిజెపి పార్టీని గెలిపించాలని కోరారు. భారత దేశ అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం బిజెపి అని, అభివృద్ధి కావాలంటే బిజెపికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలు, మోసపూరిత వాగ్దానాలు ఇవ్వడం మోసం చేయడం తప్ప కాంగ్రెస్తో ఒరిగేదేమీ లేదన్నారు. కాంగ్రెస్ కల్లబొల్లి మాటలు ప్రజలు నమ్మరాదని దేశం కోసం పరితపించే ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలపరచాలని, జహీరాబాద్ ఎంపీ బిబి పాటిల్ ను గెలిపించి ఈ ప్రాంత అభివృద్ధికి సహకరించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు బ్రహ్మం, సీనియర్ నాయకులు వరప్రసాద్, పార్టీ అధ్యక్షులు యాదగిరి, ప్రధాన కార్యదర్శి సాయిల్ గౌడ్, మహిళా మోర్చా అధ్యక్షురాలు వసంత, నందన్ గౌడ్, మారుతి, ఆంజనేయులు, నారాయణ, నాగులు తదితరులున్నారు.

# గుడిసె వాసులకు ఇళ్ల పట్టాలు, ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తాం



ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి: ఈ 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు మీ ఓటేసి గెలిపిస్తే ఎర్ర చెరువులోని గుడిసె వాసులకు తప్పక ఇళ్ల పట్టాలతో పాటు 5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం పార్లమెంట్ ఎన్నికల చివరి రోజు ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే జీఎస్సార్ భూపాలపల్లి పట్టణం లోని స్థానిక అంబేద్కర్ సెంటర్ లో సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి బందు సాయి లుతో కలిసి స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో పాల్గొన్నారు. అనంతరం అక్కడ ప్రజలనిద్దేశించి ఎమ్మెల్యే జీఎస్సార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు మీ ఓటేసి గెలిపిస్తే గుడిసె వాసులకు తప్పక ఇళ్ల పట్టాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామని అన్నారు. పదేళ్ల మోదీ పాలనలో ధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలను ఇబ్బంది పెట్టినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి ఆదాని అంబానీలకు కట్టబెట్టాడని, దేవుడి పేరుతో మతాల మధ్య చిచ్చు పెడుతూ, పబ్బం గడిపే బీజేపీకి ఈ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. ఈ పదేళ్ల బీఆర్ఎస్, బీజేపీ పాలనలో ప్రజలకు చేసిన అభివృద్ధి ఏంటని ప్రశ్నించారు. దొంగ మాటలు, మాయ మాటలతో మీ ముందుకు ఓటు అడగడానికి వస్తున్న పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని సూచించారు. వరంగల్ లో డాక్టర్ కడియం కావ్య కు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు అయిత ప్రకాష్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రామ్ నర్సింహారెడ్డి, ఓబిసి చైర్మన్ కత్తి వెంకటస్వామి, పీసీసీ సభ్యుడు చల్లూరి మధు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, జిల్లా నాయకులు బుర్ర కొమురయ్య, పిప్పాల రాజేందర్, సిపిఐ పట్టణ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, సిపిఐ జిల్లా నాయకులు కొరిమి సుగుణ క్యాథరాజు సతీష్, తీష్, గురుజేపల్లి సుధాకర్ రెడ్డి, వేముల శ్రీకాంత్, నేరెళ్ల జోసఫ్ సుమారు 3వేల మంది పాల్గొన్నారు.

## ఎన్నికల విధులు సమర్ధవంతంగా నిర్వర్తించాలి

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని భూపాలపల్లి నియోజక వర్గంలో ఎన్నికల విధులు నిర్వర్తించనున్న జిల్లా పోలీసులు, సిఆర్పిఎఫ్, బిఎస్ఎఫ్ కేంద్ర బలగాలు, ఫారెస్ట్, టిఎస్ఎస్పి, శిక్షణ కానిస్టేబుళ్లకు జిల్లా కేంద్రంలోని భారత్ ఫంక్షన్ హాల్లో శనివారం ఎస్పి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. పోలింగ్ స్టేషన్లో వద్ద నిర్వర్తించాల్సిన విధులు, పోలింగ్ ముందు, పోలింగ్ రోజు, పోలింగ్ అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై ఎస్పి వివరించారు. పోలీసు అధికారులు సిబ్బందికి ఏదైనా సందేహాలు ఉంటే పై అధికారుల వద్ద తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. సమస్యాత్మక కేంద్రాలు, మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని ఎస్పి పేర్కొన్నారు.



పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీయంలను స్ట్రాంగ్ రూముల వరకు పోలీసులు తరలించాలని ఎస్పి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ ఏ. సంపత్ రావు, సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ బాబు, బిఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ అజయ్, భూపాలపల్లి, చిట్యాల సిఐ లు నరేష్ కుమార్, మల్లేష్, ఎలక్షన్ సెల్ ఇన్చార్జి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఎస్ బి వసంత్ కుమార్, రిజర్వు ఇన్ స్పెక్టర్లు నగేష్, కిరణ్, శ్రీకాంత్, రత్నం, సిఆర్పిఎఫ్, బిఎస్ఎఫ్ ఎస్సైలు, భూపాలపల్లి సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని మారుస్తాననడం సిగ్గుచేటు

ప్రజాపక్షం/చిట్యాల: ఎన్నికలలో గెలిచిన ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం పై నాటి నుండి నేటి వరకు ప్రమాణం చేసి పరిపాలనను కొనసాగించారని, జరిగే ఎన్నికల్లో ఎక్కువ సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామనడం బిజెపి పార్టీకి సిగ్గుచేటు అని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు సరిగొమ్ముల రాజేందర్ అధ్యక్షతన లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మల్లయ్య మాట్లాడుతు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ప్రపంచ మేధావి బిఆర్ అంబేద్కర్ విద్యార్థి దశలో ఉన్నప్పుడు అన్ని అవమానాలు ఎదుర్కొని పట్టుదలతో ఉన్నత చదువులు చదివి భారత రాజ్యాంగాన్ని రచించిన గొప్ప మేధావన్నారు. దళితులలో చైతన్యం తీసుకు రావడానికి ఎంతో కృషి చేశారని,భారత రాజ్యాంగంలో 18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ కుల మతాలకు అతీతంగా ఓటు హక్కు కల్పించారని అదే ఓటు తో గెలిచి రాజ్యాంగాన్ని మారుస్తామని మాట్లాడడం సిగ్గు చేటన్నారు.రాజ్యాంగాన్ని మార్చడం కాదు సవరణలు చేయాలని కోరారు. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ లు కుల మతాలకు అతీతంగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా సాంస్కృతిక కార్యాదర్శి జన్నే యుగేందర్, మండల ప్రధాన కార్యదర్శి మ్యాదారి సునీల్ తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ పార్టీకి రాజీనామ కాంగ్రెస్‌లో చేరిక

ప్రజాపక్షం/నల్లబెల్లి : కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పాల కాపాడు కుంటనని నర్సంపేట ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి అన్నారు . శనివారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని నంది గామ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుడు తేజవత్ సమ్మయ్యనాయక్ ,చత్యనాయక్ ,మాజీ సర్పంచు దూడెల సుమన్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరగా పార్టీ కండువాలు ఎంఎల్ఏ దొంతి మాదవరెడ్డి కప్పారు . ఈ సందర్భంగా ఎంఎల్ఏ దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ దేశ ప్రధానిగా రాహుల్‌గాంధీ బాధ్యతలు చేపట్టం ఖాయమన్నారు . రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటి పథకాలు అమలు చేసేందుకు వెనకడుగు వేయదని గుర్తు చేశారు . పదేండ్లు బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రా ఖాజనను దెబ్బ తిసి మాజీ సిఎం కెసిఆర్ కుటుంబం రాష్ట్రాన్ని పరిపాలించిందన్నారు . ఈ కార్యక్రమంలో కాంగ్రేస్ పార్టీ ముఖ్య నాయకులు ఎర్రబెల్లి రఘుపతి ,నందిగామ కాంగ్రేస్ పార్టీ అధ్యక్షుడు జంగిలి మోహన్ ,గ్రామ పార్టీ నాయకులు గందు మహేందర్ ,వైనాల పవన్ ,రాంకోఠం ,నాగరాజ్ ,మూడు రాజు , దీకొండు శ్రీను ,గుగులోతు శంకర్ ,సంగ శ్రీను వాస్ ,రావుల శంకర్ తదితరులు పాల్గోన్నారు .



## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి: ఓటరు గుర్తింపు కార్డు లేకుంటే 12 రకాల ప్రత్యామ్నాయ ఫోటో గుర్తింపు కార్డులలో ఏదో ఒక దానిని చూపెట్టి తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఎన్నికల కమీషన్ కల్పించిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి ఇలా త్రిపాఠి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిక్ కార్డులోని వాళ్లు ఆధార్‌కార్డు, ఎంజిఎన్ఆర్ఈజిఎస్ జాబ్‌కార్డు, బ్యాంక్, పోస్టాఫీస్ వారిచే జారీ చేసిన పాస్ పుస్తకాలు, కార్మిక మంత్రిత్వశాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ఎన్‌పిఆర్ క్రింద ఆర్‌జిఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు, పాస్‌పోర్ట్, ఫోటోతో కూడిన పెన్షన్ డాక్యూమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పిఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ సంస్థల ఉద్యోగులకు ఫోటోతో జారీ చేసిన ఐడి కార్డు, ఎంపి, ఎంఎల్ఏ, ఎంఎల్సీలకు జారీ చేసిన ఐడి కార్డు, ప్రత్యేక వైకల్యం ఐడి కార్డులలో ఏదో ఒక దానితో ఓటు వేయవచ్చని తెలిపారు. అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును ఎన్ని పనులు ఉన్న పోలింగ్ రోజు ఏప్రిల్ 13న సమయం కేటాయించి తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి ఒక ప్రకటనలో తెలిపారు.



## మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలలో పటిష్ట భద్రత

ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి: పార్లమెంట్ ఎన్నికలు సోమవారం నాడు జరనున్నందున ములుగు జిల్లాకు పెద్దయెత్తున హైదరాబాద్ ఖమ్మ, హనుమకొండ, నల్గొండ వంటి జిల్లాల నుండి అటవీశాఖ టిఎస్ఎస్పి బలగాలను జిల్లా ఎస్‌పి రప్పించడి జరిగింది. శనివారం ములుగు జిల్లా కేంద్రంలో గల డివిఎల్ఆర్ గార్డెన్‌లో వీరందరికి ఎన్నికల నియమావళి పట్ల ఎస్‌పి ఖచ్చితమైన సూచనలు అందించారు. ఈ సమావేశంలో సిబ్బందికి పోలింగ్ లోకేషన్ పోలింగ్ కేంద్రాలలో అవలంబించాల్సిన తీరు, ఓటర్ క్యూలైన్ నిర్వహణ పోలింగ్ కేంద్రాలలో 100 మీటర్స్ 200 మీటర్స్ పరిధిలో పాటించాల్సిన మార్గదర్శకాలను ఎస్‌పి అందించారు. అలాగే పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ లను అనుమతించరాదని, ఈవీఎంలను ధ్వంసం చేయడానికి ఉపయోగించు కత్తులు, రాడ్లు వంటి ఆయుధాలు మంటలు కలిగించు అగ్గిపెట్టె పెట్రోల్ వంటి వస్తువులను అనుమతించరాదని, అలాగే ఆయుధాలు కలిగిన ప్రభుత్వ అధికారులను సైతం అనుమతించరాదని ఓటర్లతో మర్యాదగా ప్రవర్తించాలని వృద్ధులకు గుడ్డివారికి సహకారంగా ఉండాలని తెలిపారు. పోలింగ్ లోకేషన్‌లోకి వాహనాలకు అనుమతి లేదని పార్టీ జెండాలు కానీ గుర్తులు కానీ కేంద్రంలోకి అనుమతించరాదని పోలింగ్ కేంద్రంలోపల ప్రచారానికి అనుమతి లేదని, పోలింగ్ కేంద్రాల చుట్టు ప్రక్కల లౌడ్ స్పీకర్లతో రాజకీయ పాటలు వంటివి నిషేధం అని పోలీస్ సిబ్బంది ఎవరు కూడా తమ డ్యూటీ పాయింట్లను ఎట్టి పరిస్థితుల్లో వదిలి వెళ్ళకూడదని తెలియజేస్తూ పోలీస్ అనే వ్యక్తి సమస్యను తీర్చే విధంగా ఉండాలి, కానీ సమస్యగా మారకూడదని ప్రతి ఒక్క పోలీస్ ఎన్నికల నియమావళికి కట్టుబడి నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్‌పి సదానందం, సిఐడి డిఎస్‌పి పి రవీందర్, డిఎస్‌పి రవికుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్, సిఐ ములుగు రంజిత్‌కుమార్, సిఐ కమ్యూనికేషన్స్ రోహిత్, ఎ స్ఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.